వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్‌గా సిరాజుద్దీన్

11 మందితో నూతన కమిటీ నియామకం

శ్రీకాకుళం: వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షులుగా మహమ్మద్ అబ్దుల్ సిరాజుద్దీన్ (సిజ్జు) నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వక్ఫ్ బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి జవాబ్ అబ్దుల్ ఖాదిర్ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన కమిటీలో ఉపాధ్యక్షునిగా షేక్ సాబ్జి, కార్యదర్శిగా షేక్ అలీ జాన్, కార్యవర్గ సభ్యులుగా మహ్మద్ సలీమ్ ఖాన్, ఎంఎ షఫీ, ఎకెఎస్ సాధిక్ అహ్మద్, షేక్ అజీజ్, షేక్ అబ్దుల్ రెహమాన్, సర్ఫాస్ట్ ఆలమ్, షేక్ సుదీనా, మీక్ ఖాసిమ్ హుస్సేన్ ఉన్నారు. వక్ఫ్ బోర్డు నూతన అధ్యక్షుడు సిరాజుద్దీన్‌ను వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అభినందించారు. జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, వైసిపి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శిమ్మ రాజశేఖర్, గొండు రఘురాం తదితరులు అభినందించిన వారిలో ఉన్నారు.

బిల్లు కట్టలేదు... కనెక్షన్ కట్ చేస్తాం

- విద్యుత్ వినియోగదారులకు నకిలీ సందేశాలు
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

బ్యాంకు నంబరుకు ఆధార్ అనుసంధానం కాలేదు... పాన్ నంబరు నమోదు కాలేదు... మీ ఎటిఎం కార్డు పనిచేయడం లేదు... ప్రముఖ ఆన్‌లైన్ షాపింగ్ కంపెనీలు ప్రత్యేక ఆఫర్లు పెట్టాయి. రూ.20 వేల విలువ చేసే ఫోన్ రూ.2 వేలకే... ఈ లింక్ క్లిక్ చేయండి అన్న సైబర్ మోసాల గురించి వినే ఉంటారు.

ఆ విధంగానే విద్యుత్ వినియోగదారులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు నకిలీ సందేశాలు (మెసేజ్‌లు) పంపుతున్నారు. జిల్లాలో పలువురికి ఈరకమైన మెసేజ్‌లు సోమవారం వచ్చాయి. 'ప్రియమైన వినియోగదారునికి ముందు నెల మీ బిల్లు అప్‌డేట్ కాకపోవడంతో ఈరోజు రాత్రి 9.30 గంటలకు విద్యుత్ శాఖ మీ కనెక్షన్‌ను తొలగించును. దయచేసి తక్షణమే మా ఎలక్ట్రిసిటీ అధికారి ఫోన్ నంబరు 8260679712 సంప్రదించండి. ధన్యవాదాలు'. ఇదీ అందులో ఉన్న సారాంశం. దీనిపై విద్యుత్‌శాఖ అధికారులను సంప్రదించగా అది నకిలీ మేసేజ్ అని తేలింది. మెసేజ్‌లో పేర్కొన్న మొబైల్ నంబరు అసలు విద్యుత్‌శాఖకు సంబంధించినది కాదని అధికారులు స్పష్టం చేశారు. తాము సాయంత్రం ఆరు గంటల తర్వాత విద్యుత్ కనెక్షన్లు తొలగించేది ఉండదని చెప్పారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్న టెన్షన్‌లో పొరపాటున ఆ నంబర్‌కు ఫోన్ చేస్తే ఆ నంబర్‌కు ఫోన్‌పే చేయాలని చెప్పడమో, బ్యాంకు ఖాతా నంబరు చెప్తే తామే బిల్లు డబ్బులు జమ చేసుకుంటామని అడగడమో చేస్తారనే చర్చ నడుస్తోంది. తర్వాత ఖాతాల నుంచి డబ్బులను ఖాళీ చేసే అవకాశం ఉండవచ్చని పలువురు విద్యుత్‌శాఖ ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. మెసేజ్‌లో పేర్కొన్న సమయానికి విద్యుత్ కనెక్షన్ జోలికే ఎవరూ రాకపోవడంతో అది నకిలీ మెసేజ్‌గా రుజువైంది. ఇటువంటి మెసేజ్‌లపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఎపిఇపిడిసిఎల్ అధికారులు చెప్తున్నారు. సైబర్ క్రైమ్ పోలీసులు వీటిపై దృష్టిసారించాలని వినియోగదారులు కోరుతున్నారు.

> Dear consumer your Electricity power wili be Disconnected Tonight at 9.30 pm from electricity Office. Because your Previous month bili was Not update. Please immedietaly contact with our electricity officer 8260679712 Thank you.

సంఘ సంస్కర్త పూలే

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

పూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న స్పీకర్ తమ్మినేని

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్ / పలాస

బహుజన నాయకుడు మహాత్మా జ్యోతిరావు పూలే గొప్ప సంఘ సంస్కర్త అని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పూలే 132వ వర్ధంతి సందర్భంగా నగరంలోని పూలే పార్కులో ఆయన విగ్రహానికి స్పీకర్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మహాత్మా బిరుదు పొందిన మహానుభావులు ఇద్దరేనని ఒకరు జ్యోతిరావు పూలే కాగా, మరొకరు జాతిపిత గాంధీ అని అన్నారు. అట్టడుగు, బలహీనవర్గాల ప్రజలపై సామాజిక స్పృహ కలిగిన వ్యక్తి పూలే అని చెప్పారు. స్త్రీలకూ విద్య అవసరమని గుర్తించి, ఆ కాలంలోనే నిరక్షరాస్యులైన మహిళలకు విద్యను అందించిన విద్యావేత్త అని ప్రశంసించారు. రైతు విధానం, జాతీయ సమైక్యత అంశాలపై పోరాటం చేసి సమాజానికి దిక్సూచిగా మారారని చెప్పారు. తన సతీమణి సావిత్రిబాయి పూలేతో కలిసి పాఠశాలలు నెలకొల్పారన్నారు. పూలే ఆలోచనలు, ఆశయాలను స్మరించుకుంటూ వాటిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పలు శాఖల అధికారులు ఆర్.గడ్డెమ్మ, ఆర్.రామారావు, ఇ.అనురాధ, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పి.చంద్రపతిరావు, ప్రధాన కార్యదర్శి బాడాన దేవభూషణరావు, అలిండియా దళిత రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు కంఠ వేణు తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గలోని ప్రగతి భవనంలో పూలే చిత్రపటానికి రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలాస మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు, వైస్ చైర్మన్లు మీసాల సురేష్‌బాబు, బోర బుజ్జి, ఎఎంసి చైర్మన్ పి.వి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లాకు చెందిన సీపాన గోవిందరావు ఎన్నికయ్యారు. ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆ సంస్థ మొదటి మహా జనసభను నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గం ఎన్నికలో ఆయన్ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. గోవిందరావు శ్రీకాకుళం నగరం పిఎన్ కాలనీలో వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. ఆయన ఎన్నికపై ఎపిఆర్ఎస్ఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేణుగోపాల్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, డి.టి రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, ఎపిఎన్ఎస్ఎ అధ్యక్షులు సుధాకర్, సచివాలయ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రఘునాథ్ పాణిగ్రహి, అమర్‌నాథ్ తదితరులు అభినందనలు తెలిపారు.

5న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

నినాదాలు చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కంచిలి

మండలంలోని నువగూడ పంచాయతీ భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిసెంబరు ఐదో తేదీన తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.లక్ష్మీనారాయణ, కె.మోహనరావు తెలిపారు. ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నువ్వగూడ పంచాయతీలో సోమవారం పర్యటించిన అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నువ్వగూడ పంచాయతీలో గిరిజనులు తరతరాలుగా భూమిని సాగు చేస్తున్నా, వారి పేర్లు వన్ బిలో గానీ అడంగల్‌లో గానీ చూపించడం లేదని చెప్పారు. నువ్వగూడ భూ సమస్యలపై గతంలో అధికారులకు వినతిపత్రం ఇచ్చినా సరైన స్పందన లేదన్నారు. ప్రభుత్వ యంత్రాంగం వెంటనే జోక్యం చేసుకుని నువ్వగూడ భూ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతుసంఘం, గిరిజన సంఘ నాయకులు మోహనరావు, కైలాష్, రాజేంద్ర, నరసింగరావు, సంతోష్ గొమాంగో తదితరులు పాల్గొన్నారు.

ఆ కళాశాలలో పనిచేయలేం

- ప్రిన్సిపల్ వేధింపులు భరించలేకున్నాం
- వేరే కళాశాలకు బదిలీ చేయండి
- సిఎంకు శ్రీకాకుళం పురుషుల డిగ్రీ కళాశాల అధ్యాపకుల లేఖ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలకు ఉత్తరాంధ్రలోనే ఎంతో పేరు ప్రతిష్టలున్నాయి. ఇదే కళాశాలలో చదువుకుని ఎందరో ఉన్నత శిఖరాలకు ఎదిగారు. అటువంటి కళాశాలలో ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలు అప్రతిష్టను తెచ్చిపెడుతున్నాయి. ప్రిన్సిపల్ సురేఖ నియంతృత్వ చర్యలు, ఒంటెత్తు పోకడలే ఇందుకు కారణమని పలువురు అధ్యాపకులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. కీలక విషయాలపై వైస్ ప్రిన్సిపల్, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో చర్చించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ మండిపడుతున్నారు. స్టాఫ్ కౌన్సిల్ తీర్మానాలకు విరుద్ధంగా సొంత నిర్ణయాలు అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యక్తిగత దూషణలు, కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ తమను మానసిక క్షోభకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ కళాశాల అధ్యాపకులు పలువురు ముఖ్యమంత్రి జగన్‌కు లేఖ రాశారు.

ప్రిన్సిపల్ వైఖరితో పడుతున్న ఇబ్బందులతో గవర్నమెంట్ కాలేజ్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ పేరుతో గత నెల 13వ తేదీన ముఖ్యమంత్రికి వినతిపత్రం పంపారు. అందులో ముఖ్యమైన అంశాలు ఇలా ఉన్నాయి. డిగ్రీ పరీక్షలకు సంబంధించి మూడు దశల్లో చేపట్టిన స్పాట్ వ్యాల్యుయేషన్‌కు కనీసం 20 మంది గెస్ట్, కాంట్రాక్టు అధ్యాపకులనైనా పంపలేదని, దీంతో బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ పరిధిలో చదివిన చివరి సంవత్సర ఫలితాలు ఆలస్యంగా వచ్చాయని చెప్తున్నారు. పలురకాల పిజి ప్రవేశ పరీక్షలు రాసిన విద్యార్థులు ఆ సీటు కోల్పోవడానికి కారణమయ్యారని చెప్తున్నారు. స్పాట్ వ్యాల్యుయేషన్ సెప్టెంబర్‌లోనే వచ్చినా అక్టోబరు 25న హడావుడిగా అధ్యాపకులతో సంతకాలు చేయించి ముందు తేదీతో అనుమతులు ఇచ్చినట్లుగా ఉన్నతాధికారులను ప్రిన్సిపల్ సురేఖ మభ్యపెట్టారని ఆరోపిస్తున్నారు.



సిఎంకు రాసిన లేఖ

మహిళా అధ్యాపకులకూ తప్పని మనోవేదన

మహిళా అధ్యాపకులను సైతం సురేఖ వేధిస్తున్నారనే చర్చ నడుస్తోంది. మహిళల వ్యక్తిగత సమస్యల సమయంలో అర్జెంట్‌గా సెలవు కావాల్సి వచ్చినప్పుడు ముందురోజు దరఖాస్తు చేయడం తెలియదా? చేతులు బాగానే ఉన్నాయి కదా? లెటర్ రాయడానికి ఏమైందని ఇబ్బందికరంగా మాట్లాడుతున్నట్లు కొందరు మహిళా అధ్యాపకులు చెప్తున్నారు.

అధ్యాపకులపై వ్యక్తిగత కక్షలు

కళాశాలలో పనిచేస్తున్న పలువురు అధ్యాపకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మెడికల్ బిల్లు జాప్యంపై ప్రశ్నించిన తెలుగు అధ్యాపకుడు పి.నారాయణరావును దుర్భాషలాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిజికల్ డైరెక్టర్ జిపిఎఫ్ రుణం మంజూరు పత్రాలపై నెలల తరబడి సంతకాలు చేయకుండా కాలయాపన చేశారని చెప్తున్నారు.

సెలవుల మంజూరులోనూ వేధింపులు

నాక్ పేరుతో అవసరం లేకపోయినా ఉద్దేశపూర్వకంగా ప్రతిరోజూ సాయంత్రం ఆరు నుంచి ఏడు గంటల వరకు కళాశాలలో ఉండాలని చెప్తున్నారని పలువురు అధ్యాపకులు ఆరోపిస్తున్నారు. యుజిసి బకాయిల చెల్లింపులు, ఉత్తర్వుల అమల్లో తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారని చెప్తున్నారు. సాధారణ సెలవులు మంజూరు చేయడానికీ ఇబ్బందులు పెడతున్నారని, సెలవు మంజూరు చేసిన తర్వాత కూడా ఫోన్ చేయించి తిరిగి రమ్మంటారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్పాట్ వాల్యుయేషన్‌కు పంపలేదనే...

జిల్లాలోని ఇతర కళాశాలల మాదిరిగానే స్పాట్ వాల్యుయేషన్‌కు అనుమతిచ్చాం. సాధారణ సెలవు కోసం టీచింగ్ లెర్నింగ్ ఫ్లాట్‌ఫాంలో అప్‌లోడ్ చేయాల్సి ఉన్నందున ముందు రోజే అనుమతి తీసుకోవాలి. మహిళా అధ్యాపకులందరినీ ఇబ్బందేమీ పెట్టలేదు. నాకు సమాచారం ఇవ్వని వారికి అటెండెన్స్ రిజిస్టర్‌లో ప్రశ్న మార్కును పెట్టాం. కావాలనే నిందలు వేస్తున్నారు. నాక్ కోసం ఐదు గంటల తర్వాత ఎంతమంది ఉన్నారో బయోమెట్రిక్ పరిశీలిస్తే తెలుస్తుంది. స్పాట్‌కు వాల్యుయేషన్‌కు పంపలేదనే కొందరు అధ్యాపకులు కలిసి ఇదంతా చేస్తున్నారు. అందరితో సంతకాలు చేయించారు.

- డాక్టర్ పి.సురేఖ,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం

కొత్త మెనూతో విద్యార్థులకు ఇబ్బందులు

మాట్లాడుతున్న మహాలక్ష్మి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మధ్యాహ్న భోజన పథకం (జగనన్న గోరుముద్ద)లో తీసుకొచ్చిన కొత్త మెనూలోని ఆహార పదార్థాలు కొన్ని తినక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.ఉత్తర, ఎ.మహాలక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు తెలిపారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన యూనియన్ జిల్లా విస్తృత సమావేశంలో వారు మాట్లాడారు. కొత్త మెనూను తక్షణమే రద్దు చేసి, పాత మెనూనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. సోమవారం హాట్ పొంగలి పెట్టాలని మెనూలో ఉందని, పిల్లలు దాన్ని తినడం లేదన్నారు. పప్పు, ఆకుకూర మార్చారని, మళ్లీ దాన్ని అమలు చేయాలని మార్పు చేశారని చెప్పారు. పిల్లలు సరిగా ఇష్టపడని మెనూ అమలు చేయడం సరికాదన్నారు. అలవాటు లేని ఆహారం తినడానికి ఇబ్బంది పడే పరిస్థితి ఉందన్నారు. ఎప్పటికప్పుడు మెనూ మార్చడం వల్ల వంట ఏజెన్సీ కార్మికులు గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, పాఠశాలల విలీనం పేరుతో చాలామంది కార్మికులను తొలగించి ఇంటికి పంపించే ప్రయత్నం ప్రభుత్వం చేసిందన్నారు. విలీనం వల్ల హైస్కూళ్లలో కార్మికులకు పనిభారం పెరిగిందన్నారు. 9, 10 తరగతులకు వంట చేస్తున్న కార్మికులకు వేతనాలు అమలు చేయాలని, గౌరవ వేతనం రూ.ఆరు వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెనూ ఛార్జీ రూ.20కు పెంచాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. అక్షయపాత్రకు ఇచ్చిన మధ్యాహ్న భోజన పథకాన్ని రద్దు చేసి కార్మికులకే అప్పగించాలని డిమాండ్ చేశారు. వంటగ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, వర్కర్లకు వంటపాత్రలు, గ్యాస్ స్టవ్, రెండు జతల యూనిఫారం ఇవ్వాలని, రాజకీయ వేధింపులు, తొలగింపులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వంట కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. సమావేశంలో సుశీల, లక్ష్మి, సీతమ్మ, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు

రైతులకు తీరని అన్యాయం

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల రైతులకు తీరని అన్యాయం చేస్తోందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. నగరంలోని జిల్లాపరిషత్ కార్యాలయం వద్ద రైతు గెలవాలి... వ్యవసాయం నిలవాలని నినాదాలు చేస్తూ సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే పేరుతో ఎక్కడెక్కడ భూములు ఉన్నాయి, వాటిని ఎలా కొల్లగొడదామన్న ఆలోచన తప్ప ఆ భూమిపై ఆధారపడి జీవిస్తూ నష్టాలపాలవుతున్న రైతులను ఆదుకోవాలన్న ఆలోచన జగన్ ప్రభుత్వానికి లేదన్నారు. రైతులకు పంటల బీమా అంతా ప్రభుత్వమే చెల్లిస్తుందని నమ్మించి, మూడేళ్లుగా బీమా దక్కకుండా చేశారని ఆరోపించారు. రైతులకు ఇవ్వాల్సిన రాయితీలను పక్కదోవ పట్టిస్తూ రైతుభరోసా కేంద్రాల పేరుతో వ్యాపార కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ పెద్దలే దళారీగా వ్యవహరిస్తూ కమీషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు రైతులకు రాయితీపై అందడం లేదన్నారు. రైతులకు సకాలంలో పంటరుణాలు ఇవ్వకపోవడం వల్ల అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సహకార బ్యాంకుల్లోనూ అప్పులు లభించని పరిస్థితి నెలకొందన్నారు. మరోవైపు ఆరుగాలం పండించిన రైతులకు మద్దతు ధర లభించడం లేదన్నారు. ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నామంటున్న ప్రభుత్వం, కొన్న ధాన్యానికి సకాలంలో డబ్బులు చెల్లించడం లేదని విమర్శించారు. సుడిదోమ పోటుతో పాడైన పంటకు పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అన్నివిధాలుగా రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్న వైసిపి ప్రభుత్వానికి రైతులు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయన్నారు. అనంతరం స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, జిల్లా అధ్యఓఉలు ఎం.ఆనందరావు, టిడిపి నాయకులు పి.ఎం.జె బాబు, టి.వెంకన్న యాదవ్, మూకళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో దళారులు వద్దు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ధాన్యం సేకరణలో దళారుల ప్రమేయం ఉండరాదని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ స్పష్టం చేశారు. ధాన్యం సేకరణ, రీ సర్వే, కొలతరాళ్ల ప్లాంటేషన్, ఇళ్ల స్థలాలు, పెండింగ్ సైట్ సమస్యలు, మ్యుటేషన్లు, నాలా, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు, ప్రాధాన్యతా భవనాలు, స్పందన అర్జీలు తదితర వాటిపై మండల ప్రత్యేకాధికారులు, మండల స్థాయి అధికారులతో కలెక్టరేట్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గనీస్, లేబర్, రవాణాపై తక్షణమే మండల ప్రత్యేకాధికారి, తహశీల్దార్, వ్యవసాయాధికారులు, సిఎస్‌డిటిలతో ఒక సమావేశం ఏర్పాటు చేసి, మండలంలో ఎంత ధాన్యం వస్తుందో ముందుగానే ప్రణాళిక వేసుకోవాలన్నారు. స్టోన్స్ ప్లాంటేషన్స్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రోవర్స్ కొరతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జెసి నవీన్‌కు సూచించారు. బిహెచ్‌పి, రీ సర్వే, స్టోన్ ప్లాంటేషన్, పిఒఎల్ఆర్ తదితర వాటిపై డివిజనల్ అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి సమాచారంతో సమావేశానికి సూపరింటెండెంట్లు హాజరు కావాలని ఆదేశించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లుగా అర్హులైన వారు నమోదు చేసుకోవాలని కోరారు. నియోజకవర్గాల వారీగా ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్‌పై సమీక్షించారు. అన్ని కళాశాలల్లో స్వీప్ నిర్వహించి కొత్త ఓటర్ల నమోదుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహశీల్దార్లు దీనిపై దృష్టిసారించాలన్నారు. గడపగడపకు కార్యక్రమంలో గ్రామ సచివాలయ స్థాయిలో గుర్తించిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాధాన్యతా భవనాలను వేగవంతం చేయాలన్నారు.

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ ధాన్యం సేకరణలో దళారీ వ్యవస్థకు తావు లేకుండా నూతన విధానాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. రీ సైక్లింగ్ తావు లేకుండా చూడాలన్నారు. ధాన్యం సేకరణలో రైతులకు మేలు చేకూరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకానికి సంబంధించి రైతుల ఇకెవైసి చేసి పట్టాలను పంపిణీ చేయాలని ఆదేశించారు. స్పందన అర్జీలు పెండింగ్‌లో లేకుండా చూడాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఆర్‌డిఒ బి.శాంతి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిపిఒ రవికుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ప్రసాదరావు, హౌసింగ్ పీడీ గణపతిరావు, పలు శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

నమూనా చెక్కును అందజేస్తున్న స్పీకర్, మంత్రి తదితరులు

వ్యవసాయ రంగంలో నూతన ఒరవడి

- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు
- రైతుల ఖాతాల్లో రూ.23.08 కోట్ల సున్నా వడ్డీ రాయితీ
- రూ.1.16 కోట్ల పంట నష్ట పరిహారం జమ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వ్యవసాయ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం నూతన ఒరవడిని తీసుకొచ్చిందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. 2020 రబీ, 2011 ఖరీఫ్ సీజన్లకు చెందిన సున్నా వడ్డీ రాయితీ, ఈ ఖరీఫ్‌లో పలురకాల వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో జమ చేశారు. కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రబీ 2020-21 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలోని 28,287 మంది రైతులకు రూ.3.38 కోట్ల వడ్డీ రాయితీని చెల్లించినట్లు తెలిపారు. 2021 ఖరీఫ్‌లో 59,726 మంది రైతులకు రూ.9.78 కోట్లు, గత ప్రభుత్వంలో జమ కాని 54,878 మంది రైతుల ఖాతాలకు రూ.9.91 కోట్లు చెల్లింపులు చేసినట్లు వివరించారు. జిల్లాలో 1,42,893 మంది రైతుల ఖాతాల్లో రూ.23.08 కోట్ల వడ్డీ రాయితీ వేసినట్లు తెలిపారు. పంట నష్ట పరిహారం కింద హెక్టారుకు రూ.15 వేలు చొప్పున జిల్లాలోని 3,398 మంది రైతులకు రూ.1.15 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, వ్యవసాయ శాఖ జెడి శ్రీధర్, అనుబంధ శాఖల అధికారులు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న స్పీకర్ సీతారాం

క్రీడాకారిణికి అభినందనలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని కొత్తవలసకు చెందిన క్రీడాకారిణి కూటికుప్పల వరలక్ష్మిని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం అభినందించారు. క్రీడాకారిణిగా అంచెలంచెలుగా ఎదుగుతూ సిక్కోలుకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఏషియన్ మహిళ సాఫ్ట్‌బాల్ సీనియర్స్ విభాగం-2022కు భారతదేశం తరుపున బ్యాంకాక్‌లో డిసెంబరు 17న ఆడేందుకు ఎంపికైన విషయం విదితమే. తన సత్తాను నిరూపించుకునేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో సత్తాచాటి దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు, మండలానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని అన్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం అన్నివేళలా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కొత్తవలస సర్పంచ్ మెట్ట నాగజ్యోతి, పీడీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మొజ్జాడ వెంకటరమణ, సిపిఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గురుగుబెల్లి భాస్కరరావు, అసోసియేషన్ ప్రతినిధులు బొడ్డేపల్లి సురేష్‌కుమార్, పాపినాయుడు, కూటికుప్పల సూర్యం, రాజు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న వేణుగోపాల్

మార్షల్ ఆర్ట్స్‌కు బ్రూస్‌లీ స్ఫూర్తి

ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బ్రూస్‌లీని స్ఫూర్తిగా తీసుకొని మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులు ఎదగాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ పిలుపునిచ్చారు. రావులు సాయిబాబాస్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన నగరంలోని అబ్దుల్ కలాం పార్కులో సోమవారం బ్రూస్లీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సినీ రంగంలోనూ, క్రీడా రంగంలోనూ బ్రూస్లీ అద్భుతమైన పాత్ర పోషించారన్నారు. బ్రూస్లీ స్ఫూర్తితో ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగారన్నారు. పిన్న వయస్సులోనే బ్రూస్లీ మరణించినా ఆయనను ప్రపంచవ్యాప్తంగా నేటికీ స్మరించుకుంటున్నారంటే ఆయన గొప్పతనం ఏమిటో అర్థమవుతుందన్నారు. ముందుగా ఎపిజె అబ్దుల్ కలాం విగ్రహానికి, బ్రూస్లీ, రావులు సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ ఎం.విజయకుమార్, డాక్టర్ కె.రాధాకుమారి, డాక్టర్ ఎం.రవి, డి.జ్ఞానభాస్కరేవ్, అసోసియేషన్ అధ్యక్షుడు నకిడాపు చంద్రరావు, కోచ్ కె.గాయత్రి, పార్క్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో వినతుల పరిష్కారం

జాయింట్ కలెక్టర్ నవీన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజలు వ్యయ ప్రయాసల కోర్చి ఉన్నత స్థాయిలో ఫిర్యాదు చేస్తే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని నమ్మకంతో వస్తున్నారని, వారి నమ్మకాన్ని నిజం చేయాల్సిన బాధ్యత ప్రతి ప్రభుత్వ శాఖల అధికార్లపైనా ఉందని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పేర్కొన్నారు. జెడ్‌పి సమావేశ మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా 195 ఫిర్యాదులు వచ్చాయి. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పాల్గొని మాట్లాడుతూ పాత్రునివలస టిడ్కో ఇళ్లు వెంటనే లబ్ధిదారులకు అందజేయాలని విన్నవించారు. లబ్ధిదారులు అప్పులు చేసి ఇళ్లకు డిపాజిట్లు చెల్లించారని, నగరపాలక సంస్థ పరిధిలో డిడిలు స్వీకరించినప్పటికీ ఇప్పుడు జవాబు చెప్పే వారు కరవయ్యారని వివరించారు. పలాస మండలం రెంటికోటకు చెందిన జగనన్న కాలనీ లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చినా స్థలాలు చూపించడం లేదని, గతంలో ఆర్‌డిఒ, తహశీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలు ఇచ్చిన ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. లావేరు మండలం కొత్తకోటకు చెందిన రామారావు 2020లో మొక్కజొన్న డిఆర్‌డిఎ ద్వారా విక్రయించాడు. అతనికి మార్క్‌ఫెడ్ నుంచి రూ.94వేలకు పైగా నిధులు ఖాతాలో జమచేశారు. కానీ, రెండేళ్ల తర్వాత ఖాతాలో జమైన మొత్తాన్ని తిరిగి చెల్లించాలని రామారావును బెదిరిస్తున్నారంటూ జెసికి ఫిర్యాదు చేశాడు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలని కోరుతూ నరసన్నపేట, జలుమూరు మండలాలకు చెందిన పలువురు రైతులు జెసిని కోరారు. వ్యక్తిగత, సామాజిక అవసరాల కోసం పలువురు దరకాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జెసి మాట్లాడుతూ స్పందనలో వచ్చిన వినతులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలన్నారు. రెవెన్యూ, వైద్య ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పౌర సరఫరాలు, మహిళా శిశుసంక్షేమం, మత్స్యశాఖ, పంచాయతీరాజ్, గృహనిర్మాణశాఖ, డ్వామా, మున్సిపల్ కార్పొరేషన్, ఉద్యానవన, దేవదాయశాఖలకు చెందిన సమస్యలపై వినతులు వచ్చాయి. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఉప కలెక్టర్ జి.జయదేవి, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట రామన్, డిపిఒ రవికుమార్, డ్వామా పీడీ చిట్టిరాజు డిఎంహెచ్ఒ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న జెసి నవీన్

ఆక్రమణ స్థలాన్ని పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

ఆక్రమణలు పరిశీలన

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గలోని సూదికొండపై సర్వే నెంబర్ 51లో ఆక్రమణలను రెవెన్యూ అధికారులు సోమవారం పరిశీలించారు. అక్రమమా? సక్రమమా? అనే శీర్షికన ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. జెసి నవీన్‌కుమార్ ఆదేశాల మేరకు ఇన్‌ఛార్జి తహశీల్దార్ లక్ష్మీనారాయణతో పాటు రెవెన్యూ అధికారులు సూదికొండను పరిశీలించారు. నివేదికను జెసికి పంపనున్నట్లు తెలిపారు. పరిశీనలో ఆర్‌ఐ రవికుమార్, విఆర్‌ఒ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని ఈదుపురం పంచాయతీ పత్రీపుట్టుకలోని అగ్నిప్రమాద బాధితుడు సాయమ్మను ఆదుకుంటామని జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ నర్తు వరప్రసాద్ భరోసా ఇచ్చారు. సోమవారం బాధితురాలిని పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వపరంగా సాయంచేస్తామన్నారు. ఈసందర్భంగా జెడ్‌పిటిసి బాధితురాలికి నగదు సాయం చేశారు. కార్యక్రమంలో విఆర్‌ఒ రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'స్పందన'

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రజా సమస్యల పరిష్కరించడానికే ప్రతి సోమవారమూ పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, స్పందనలో వచ్చే ప్రతి అర్జీనీ పరిష్కరించాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక పోలీసు అధికారులకు ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యాక్రమం నిర్వహించారు. ఈ మేరకు 39 మంది ఫిర్యాదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ మేరకు ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని భరోసాఇచ్చారు. కుటుంబ తగాదాలకు సంబందించినవి ఏడు, ఆస్తి తగాదాలకు సంబంధించినవి ఎనిమిది, మోసపూరితమైన మూడు, పాత ఫిర్యాదులు 9, ఇతర ఫిర్యాదు వచ్చాయి. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్ తెలియజేసి ఫిర్యాదారులకు చట్ట పరిధిలో పరిష్కరించి సత్వర న్యాయం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి టి.వి.విఠలేశ్వరరావు, డిఎస్‌పి ఎస్.బాలరాజు పాల్గొన్నారు.

మంత్రి బొత్స వ్యాఖ్యలకు యుటిఎఫ్ ఖండన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అవసరమైతే కాళ్లు పట్టుకోవాలని వ్యాఖ్యానించడానికి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్‌కుమార్‌లు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. విజయవాడలో నిర్వహించి ఉద్యోగుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఉద్యోగులు ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారానికి అవసరమైతే రాజకీయ నాయకుల కాళ్లు పట్టుకోవాలనడం చూస్తే ఉద్యోగులను, ఉపాధ్యాయులను అవహేళన చేయడమేనన్నారు.

ఆ వ్యాఖ్యలు బాధ్యతా యుతమైన మంత్రి స్థాయికి తగ్గట్టుగా లేవన్నారు. దేశ చరిత్రలో సాధించుకున్న హక్కులన్నీ పోరాటం చేసి సాధించుకున్నవేనని అన్నారు. కానీ, పైరవీలు చేయడం చరిత్రలో లేదని మంత్రి గుర్తు ఎరిగి మాట్లాడాలన్నారు. ఒక అత్యున్నత మంత్రి పదవిలో ఉంటూ ఇలాంటి వ్యాఖ్యానాలు చేయడం ఆయన దురహంకారానికి నిదర్శనమన్నారు. కాళ్లు పట్టుకుని హక్కులు సాధించుకున్న సంఘటనలు చరిత్రలో లేవన్నారు. ఈ వ్యాఖ్యలను మంత్రి ఉపసంహరించుకోవాలని సూచించారు.

దుకాణంలో వ్యాపిస్తున్న మంటలు

గ్యాస్ సిలిండర్ లీక్

ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పలాస

కాశీబుగ్గ పాత జాతీయ రహదారి రెల్లివీధి పక్కన ఉన్న షిరిడిసాయి టిఫిన్ సెంటరులో ఉదయం సిబ్బంది టిఫిన్ తయారు చేస్తుండగా గ్యాస్ లీక్ కావడంతో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సిబ్బంది లక్ష్మి, రాముపండా గాయపడ్డారు. క్షతగాత్రులను పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. టిఫిన్ షాపులోని వేరే గదిలో టిఫిన్ తయారు చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. పని చేస్తున్న సిబ్బంది బయటకు వచ్చేశారు. సమీపంలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న కోదండరావు క్షతగాత్రులను బయటకు తీశారు. అగ్నిమాపకశాఖకు సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. గ్యాస్ సిలెండర్లు పేలకుండా వారు చర్యలు తీసుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్‌ను సిఐ శ్రీనివాసరావు అభినందించారు. రూ.వెయ్యి బహుమతి ఇచ్చారు. కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు ఘటనా స్థలిని పరిశీలించారు. దుకాణం వద్ద ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని దుకాణ యజమానులకు సూచించారు.

అజయ్‌ను అభినందిస్తున్న గురునాథరావు

ముగిసిన బాడీ బిల్డింగ్ పోటీలు

ఇచ్ఛాపురం: మిస్టర్ ఆంధ్రాగా అజయ్ యాదవ్ నిలిచాడు. ఇచ్ఛాపురం వేదికగా స్థానిక బాలికోన్నత పాఠశాలలో జరిగిన 23వ మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఆదివారం రాత్రి ప్రారంభమైన పోటీలు అర్ధరాత్రి 2గంటల వరకు సాగాయి. రాయల్ స్క్వాడ్, హనుమాన్ జిమ్ పర్యవేక్షణలో రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి 150 మంది బాడీ బిల్డర్స్ పాల్గొన్నారు. చివరిగా విశాఖకు చెందిన బి.అజయ్ యాదవ్ మిస్టర్ ఆంధ్రా టైటిల్‌తో పాటు నగదు బహుమతి రూ.30వేలు, ట్రోపి గెలుచుకున్నారు. మన్యం జిల్లాకు చెందిన ఎస్.కిషోర్ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈయనకు రూ.10వేలు నగదు బహుమతి, తతీయ స్థానంలో నిలిచిన కాకినాడకు చెందిన ఎస్.రమేష్‌కు రూ.5వేల నగదు, ట్రోఫీ అందజేశారు. విజేతలకు ప్రముఖ వైద్యులు డాక్టర్ వెచ్చా సంతోష్, రాష్ట్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి గురునాథరావు షీల్డ్‌లను అందించారు. మొత్తం 11 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ బచ్చు జగన్, సీనియర్ బాడీ బిల్డర్ నందిగాం కోటేశ్వరరావు, రాయల్ స్క్వాడ్ నిర్వాహకులు శ్రీకాంత్‌రెడ్డి , యువ సూర్య ట్రస్ట్ చైర్మన్ ఎం.రాంబాబు, బత్తుల రమణ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఈశ్వరమ్మ

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

బూర్జ : ఏలూరు జిల్లా జంగారెడ్డి గూడెంలో డిసెంబరు 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని మండల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఈశ్వరమ్మ పిలుపునిచ్చారు. ఎంపిడిఒ కార్యాలయం ముందు మహాసభల పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తమ కష్టంతో జీవిస్తున్న వ్యవసాయ కార్మికులకు భూమి ఉపాధి కనీస వేతనం సామాజిక న్యాయం లభించాలని లక్ష్యంతో 1934లో నెల్లూరు జిల్లా అలగానిపాడులో పుచ్చలపల్లి సుందరయ్య స్థాపించారని అన్నారు అక్కడ ప్రారంభమైన ఈ సంఘం ప్రస్తుతం దేశవ్యాప్తంగా 80 లక్షల సభ్యత్వంతో కష్టజీవుల హక్కుల కోసం, చట్టాల సాధన కోసం సమరశీలంగా పోరాడుతుందని చెప్పారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాయకమ్మ, కె.అప్పలనాయుడు, శ్రీను, రామారావు, వెంకన్న పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న పాపారావు

పవన్‌ను కలిసిన పాపారావు

ఆమదాలవలస : పట్టణానికి చెందిన ఇంటర్మీడియట్ బోర్డు మాజీ రీజనల్ జాయింట్ డైరెక్టర్, కౌముది విద్యా సంస్థల అధినేత పాత్రుని పాపారావు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌ను సోమవారం కలిశారు. మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి జనసేన పార్టీ నిర్వహిస్తున్న కౌలు రైతు భరోసా యాత్రకు రూ.2 లక్షల చెక్కును పవన్‌కు అందజేశారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా నాయకులు పేడాడ రామ్మోహనరావు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమాన్ని గాలికొదిలేశారు

వజ్రపుకొత్తూరు: వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బిసిలు, మత్స్యకారుల సంక్షేమాన్ని గాలికి వదిలేశారని టిడిపి బిసి సాధికారత సమితి సభ్యులు డాక్టర్ దున్న కృష్ణారావు అన్నారు. సోమవారం పూండిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 217 మత్స్యకారులకు తీవ్ర నష్టం చేకూరుస్తుందన్నారు. చెరువులు, నదులు, రిజర్వాయర్‌లను బడా వ్యాపారులకు కట్టబెట్టి సంప్రదాయ మత్స్యకారుల పొట్ట కొట్టిన్నారు. మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో మంచినీళ్లపేట వద్ద జెట్టీ కోసం నాటి టిడిపి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేస్తే, జెట్టీ కాదు హార్బర్ నిర్మాణం చేస్తామని మత్స్యకారులను ప్రభుత్వం మభ్యపెడుతుందని ధ్వజమెత్తారు.

'నాడు-నేడు' పనులకు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రజాశక్తి- కొత్తూరు

నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి బాటపడుతున్నాయని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని రెండో విడతలో భాగంగా రూ.1.56 కోట్లతో మెట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత, రూ.34.75 లక్షలతో ఓండ్రుజోల జిల్లా పరిషత్, రూ.20.71 లక్షలతో మెట్టూరుగూడ, రూ.12 లక్షలతో అడవికొత్తూరు పాఠశాలల్లో అదనపు భవన నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో పనులు ప్రారంభించి పాఠశాలలను సందరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అలాగే ఇటీవల కర్లెమ్మ పంచాయతీ నేతాజీనగర్ కాలనీకి చెందిన వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యులు లోతుగెడ్డ తిరుపతిరావు కుమారుడు రవికిషోర్ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఆమె తిరుపతిరావును పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, మెట్టూరు సర్పంచ్ ప్రతినిధి ఎం.చక్రపాణి, ఓండ్రుజోల సర్పంచ్ ప్రతినిధి నాగేంద్ర, జెడ్‌పిటిసి కె.భాగ్యవతి, ఎపిఎం త్రినాథమ్మ పాల్గొన్నారు.

చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు

సంతబొమ్మాళి: ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేయాలని పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు అన్నారు. కో-ఆపరేటివ్ సిఇఒ మాధురి అధ్యక్షతన సోమవారం పిఎసిఎస్ కార్యాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు, లెక్నికల్, కంప్యూటర్ ఆపరేటర్లు, రూట్ ఆఫీసర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎసిఎస్, 11 ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని అన్నారు. ఆర్‌బికెలకు గన్నీ బ్యాగ్‌లు అందించామని చెప్పారు. అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, ఎంపిపి ప్రతినిధి మేరుగు అప్పారావు, పిఎసిఎస్ డైరెక్టర్ మార్పు నాగభూషణరావు, తహశీల్దార్ జె.చలమయ్య, వ్యవసాయశాఖ అధికారి జి.శ్రీలక్ష్మి, సిఎస్‌డిటి రాము, సర్పంచ్ కె.లక్ష్మి, ఎంపిటిసి ప్రతినిధులు దూబ వేణు, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జగన్నాయకులు

సన్మానం చేస్తున్న అప్పలనాయుడు

పలువురికి సన్మానం

ప్రజాశక్తి- రణస్థలం

స్థానిక హెడ్ క్వార్టర్‌లోని పూలే విగ్రహం వద్ద బిసిలకు, క్రీడాకారులకు టిడిపి సీనియర్ నాయకులు, పొందూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు సోమవారం సన్మానించారు. వాలిపల్లిన రామారావు, చాలపాక శ్రీనివాసరావు, బోనం గురుమూర్తి, తరిమెల్ల సత్యం, దన్నాన భోగినాయుడు, ఇమ్మందు హరిలకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిసిల కోసం పూలే వారి సతీమణి సావిత్రి బాయ్ పూలేలు చేసిన త్యాగం ఎన్నటికీ మర్చిపోకూడదన్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- పొందూరు

శక్తివంతమైన పేలుడు పదార్థాలు వినియోగించి కార్యేలు నిర్వహించడంతో ప్రజలు ప్రాణాలు అరిచేతిలో పెట్టుకోవాల్సి వస్తోందని రాపాకకు చెందిన విశ్రాంత సైనిక ఉద్యోగి ఎలకల శ్రీనివాసరావు అన్నారు. నిషేధిత పేలుడు పదార్థాలు వినియోగించి పెద్దఎత్తున పేలుళ్ల నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయని అన్నారు. క్వారీ వద్ద ఎటువంటి హెచ్చరికలు చేపట్టకుండా పేలుడు నిర్వహించడంతో ఇటీవల రాపాకకు చెందిన ఓ వ్యక్తి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బయటపడ్డారని అన్నారు. గతంలో చాలా మృతి చెందగా... గాయపడి శాశ్వత వికలాంగులు అయిన వారు ఎందో ఉన్నారని అన్నారు. ఇటీవల ఎస్‌పి స్పందనలో ఫిర్యాదు చేశానని అన్నారు. అయినా ఎటువంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి క్వారీ పేలుళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.

హెచ్చరిక బోర్డు లేని క్వారీ

ప్రశ్నిస్తున్న సంతోష్ కుమార్

సభ్యుల ప్రశ్నలను పట్టించుకోరా..?

కౌన్సిల్ సమావేశంలో కో-ఆప్షన్ సభ్యుడు ఆగ్రహం

ప్రజాశక్తి - పలాస

కౌన్సిల్ సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు విలువ ఉండదా? కాశీబుగ్గలో నిర్వహిస్తున్న బార్ నిర్వహణపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్‌కుమార్ మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమస్యపై చైర్మన్‌కు వినతిపత్రం అందించారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. బార్ నిర్వాహణపై మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు మాట్లాడుతూ బార్‌కు అనుమతులు ఉన్నాయా లేదా, బార్ పరిసరాలు, తదితర అంశాలను పరిశీలించి విచారణకు త్రిసభ్య కమిటీ వేస్తున్నామన్నారు. అందుకు వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, కౌన్సిలర్లు బోర చంద్రకళ, పప్పల ప్రసాదను నియమించినట్లు చెప్పారు. నివేదిక అనంతరం చర్యలు తీసుకుంటామని చైర్మన్ గిరిబాబు స్పష్టం చేశారు. కౌన్సిలర్ తంగుడు ఆశారాణి మాట్లాడుతూ 20 నెలలు గడుస్తున్నా పవర్ బోర్ వేస్తారా? లేదా చెప్పండి అని అధికారులను ప్రశ్నించారు. దుర్గాశంకర్ పండా మాట్లాడుతూ కౌన్సిలర్లుకు విలువ ఇవ్వడం లేదని, ఏ ప్రశ్న అడిగినా దాటవేసే సమాధానమే ఇస్తున్నారని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ టి రాజగోపాల్ మున్సిపల్ డిఈఈ బళ్ళ హరి, కౌన్సిలర్ లు తదితరులు పాల్గొన్నారు.

తీరిక లేదు..!

మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మున్సిపల్ సమావేశానికి కౌన్సిలరులకు తీరిక లేకుండా పోయింది. ఉదయం 11గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా 11.18 నిమిషాలకు ప్రారంభమైంది. అప్పటికి చైర్మన్‌తో కలిపి 12 మంది కౌన్సిలర్లు హాజరు కాగా 11.24 సమయానికి మరో నలుగురు కౌన్సిలర్ సమావేశానికి హాజరు అయ్యారు. ఇదిలా ఉండగా మున్సిపల్ సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ విద్యుత్, హౌసింగ్, మున్సిపల్ అధికారులే వచ్చారు. మిగతా శాఖల అధికారులు హాజరుకాలేదు. ఇది ఒక ఎత్తయితే కేవలం అరగంట సమయంలో అజెండా పూర్తి కావడం సమావేశానికి కొసమెరుపు.

సిపిఎస్‌ను రద్దు చేయాలి

పలాస : సిపిఎస్‌ను రద్దు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ డిమాండ్ చేశారు. కాశీబుగ్గలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ యుటిఎఫ్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉండేటప్పుడు ఎన్నికల హామీగా వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పి ఇచ్చిన హామీని విస్మరించిందని ఆరోపించారు. సిపిఎస్ రద్దు చేయమని పోరాటం చేస్తుంటే ఉద్యోగులు, ఉపాధ్యాయులు మీద నిర్బంధాలు, బైండోవర్ కేసులు మోపుతూ ఉద్యమాలని అణచివేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సిపిఎస్‌కి ప్రత్యామ్నాయం జిపిఎస్ కాదని ఒపిఎస్ మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న కాలంలో పెద్ద ఎత్తున సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల కుటుంబసభ్యులతో ఒక పోరాట కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె.రమేష్, రాష్ట్ర కౌన్సిలర్ బి.చిట్టిబాబు యుటిఎఫ్ నాయకులు బి.ఓంకార్, టి.అప్పారావు, ఎస్‌వి.రమణ, పి.సంజయ్‌కుమార్, వేణుగోపాల్, టి.జయరాం, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

బకాయి జీతాలు ఇవ్వాలని వినతి

ఆందోళన చేస్తున్న కార్మికులు

టెక్కలి: టెక్కలి సమగ్ర రక్షిత మంచినీటి పథకంలో పనిచేస్తున్న సిపిడబ్ల్యుఎస్, ఆర్‌డబ్ల్యుఎస్ కార్మికులకు ఎనిమిది నెలలుగా జీతాలు లేవని, తక్షణమే వారికి జీతాలు చెల్లించాలని సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డికి సిఐటియు నాయకులు ఎన్.షణ్ముఖరావు కోరారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా షణ్ముఖరావు మాట్లాడుతూ ప్రజలకు తాగునీరు అందించేందుకు రాత్రి, పగలు లేకుండా కష్టపడుతున్న కార్మికులకు గతంలో ఉన్న కాంట్రాక్టరు ఐదు నెలలుగా బకాయి పెట్టారని, నేడు మరో కాంట్రాక్టరు ముందుకొచ్చిన తరువాత మూడు నెలల జీతం చెల్లించడం లేదని అన్నారు. ఇంజినీరింగ్ అధికారులు దీన్ని తమ సమస్యగా కాకుండా ఏదో ప్రభుత్వం చూసుకుంటుందన్నట్లు విడిచిపెట్టారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కింద స్థాయి కార్మికుల కష్టాలను గుర్తించడం లేదని, కనీస వేతనం పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కలుగజేయకుండా ఏళ్ల తరబడి జీతాలు బకాయిలు ఉంచుతున్నారని అన్నారు. సబ్ కలెక్టర్ తక్షణం సదరు అధికారులతో చర్చించి వెంటనే జీతాలు చెల్లించాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.సురేష్, బి.సంతోష్‌కుమార్, ఎన్.రమేష్, నాగ ఉమేష్, వి.ధర్మారావు, కె.శ్రీను, అనిల్‌పాల్గొన్నారు.

సమానత్వమే లక్ష్యం

ఎమ్మెల్యే బెందాళం అశోక్

కవిటి: బడుగు, బలహీనర్గాల శ్రేయస్సే లక్ష్యంగా, అణగారిన వర్గాల అభివృద్ధే పరమావధిగా మహనీయుడు ఎన్‌టి.రామారావు స్థాపించిన టిడిపి సర్వమానవ సమానత్వమే ధ్యేయంగా పనిచేస్తుందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. టిడిపి బిసి సాధికార కన్వీనర్‌గా ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన కొండా శంకర్‌రెడ్డిని నియమించిన సందర్భంగా సోమవారం నియోజకవర్గంలోని రెడ్డిక సంఘం నాయకులు రామయ్యపుట్టుగలో ఎమ్మెల్యే అశోక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపిలో అన్ని వర్గాలకు సమాన ప్రాతినిధ్యం ఉంటుందని, ఒకరు ఎక్కువ ఇంకొకరు తక్కువ అనే బేధాభిప్రాయాలు ఉండవని స్పష్టం చేశారు. వైసిపి హయాంలో ఇప్పటికే కులాలు, మతాలు, జాతులు, వర్గాలుగా విభజించి రాష్ట్రంలో అరాచకం సష్టిస్తున్నారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. అనుభవజ్ఞులు, గ్రామీణ ప్రాంతాల్లో పట్టున్నవారు ఇటువంటి కుటిల రాజకీయాలను ప్రజలకు విడమర్చి చెప్పాలని, సామాన్యుల్లో సైతం చైతన్యం కలిగించాలని సూచించారు. రెడ్డి కుల సంఘ నాయకులు బి.మణిచంద్రప్రకాష్, బి.కామేష్‌రెడ్డి, డి.ఢిల్లీరావు, పైల పురుషోత్తం, పి.చిన్నబాబు, డి.కామేష్, శేఖర్, అప్పన్నరెడ్డి, ఎస్.సహదేవ్, ఆశి లీలారాణి, బిసి సాధికార సభ్యులు రంగాల శ్రీను, బోర ప్రసాద్, సునీల్, సూర్యనారాయణ, ఉమాపతి, జోగారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న రెడ్డి సంఘం సభ్యులు

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

నూతన విధానంలో ధాన్యం సేకరణ

ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి- జలుమూరు

ఈ ఏడాది రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని చల్లవానిపేట పిఎసిఎస్ కార్యాలయం వద్ద సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ఈ ఏడాది నూతన మార్పులు చేసి రైతులు పండించిన ధాన్యంలో చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని అన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధరను పొందాలని కోరారు. ఎంపిపి వాన గోపి, వైసిపి మండల కన్వీనరు మొజ్జాడ శ్యామల రావు, అల్లాడ, చల్లవానిపేట పిఎసిఎస్ చైర్మన్లు పొన్నాడ మురళీనాయుడు, పాగోటి రాజయ్యనాయుడు, వైస్ ఎంపిపి తంగి మురళీకృష్ణ, సిఇఒ పి.గిరిధర్, పి.విజయకుమార్, మూకళ్ల సత్యం, ఎన్.గోవిందరావు, పి.ప్రసాద్ పాల్గొన్నారు.

అక్రమాలపై లోకాయుక్తకు ఫిర్యాదు

టెక్కలి: సీతంపేట ఐటిడిఎలో జరిగిన కొలత రాళ్ల కొనుగోళ్ల వ్యవహారంలో జరిగిన అవినీతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని లోకాయుక్తను ఆశ్రయించినట్లు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబయోగి తెలిపారు. ఐటిడిఎలో రూ.10 లక్షల వరకే టెండరుకు అనుమతి ఉందని, కానీ రూ.95 లక్షలకు టెండరు ఇచ్చారని తెలిపారు. కర్నూలులోని లోకాయుక్త కార్యాలయంలో ఫిర్యాదు చేసిన కాపీలను సోమవారం ఆయన విడుదల చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా అధికారులు వ్యవహరించారని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు.

మైనార్టీలపై వివక్ష తగదు

శ్రీకాకుళం అర్బన్ : ముస్లిం మైనారిటీలపై ప్రభుత్వానికి వివక్ష తగదని టిడిపి మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్ బాషా అన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి నరసాపురంలో నిర్వహించిన బహిరంగ సభలో ముస్లిం మహిళలను బురాకా తొలగించి సభకు అనుమతించడాన్ని నిరసిస్తూ జెడ్‌పి కార్యాలయం వద్ద టిడిపి నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి మూడున్నరేళ్ల పాలనలో ముస్లిములకు గత ప్రభుత్వం ఇచ్చిన పథకాలను నిలుపుదల చేసిందన్నారు. ముస్లిములకు కేటాయించిన నిధులు ప్రభుత్వం దారిమళ్లించిందన్నారు. ఉన్నత విద్య, విదేశీ విద్య మైనార్టీ విద్యార్థులకు అందని ద్రాక్షగా మిగిలిందన్నారు. జిల్లాలో అక్రమార్కుల చేతుల్లో వక్ఫ్‌బోర్డ్‌ను పెట్టడం సరికాదన్నారు. కేవలం వక్ఫ్ భూముల కోసమే వారికి అనువైన వ్యక్తులను బోర్డులో నియమించారని ఆరోపించారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్ షాజహాన్, జిల్లా అధ్యక్షులు షేక్ ముబారక్, షాను, సయ్యద్ సలీం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న షేక్ ఖాదిర్ బాషా

ప్రభుత్వ పథకాలే గెలిపిస్తాయి

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో విజయాన్ని తెచ్చిపెడతాయని రాష్ట్ర పశుసంవర్థకశాఖ మంత్రి అప్పలరాజు అన్నారు. పలాస, కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో నర్సిపురం గ్రామంలో సోమవారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ముందుగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వివరాలను లబ్దిదారులకు వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన పిల్లల నుంచి పండు ముసలి వరకు పథకాలు ప్రవేశపెట్టిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే వారికి కూడా అందాల చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, ఎఎంసి చైర్మన్ పి.సతీష్, కోత పూర్ణ చంద్రరావు, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, బోర బుజ్జి, మున్సిపల్ విప్ దుర్గా శంకర్ పండా, కౌన్సిలర్ పిచ్చుక అజయ్, మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాల్, మున్సిపల్ డిఈఈ బళ్ల హరి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడపగడపకు

ఆమదాలవలస : సమస్యల పరిష్కారానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. స్థానిక 13వ వార్డు కొత్తకోటవారివీధి, విద్యానగర్ ప్రాంతాల్లో సోమవారం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఇందులో భాగంగా ప్రజలకు ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాలపై వివరించి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.రవిసుధాకర్, వైసిపి నాయకులు బి.రమేష్‌కుమార్, అజంతా కుమారి, పి.శ్రీనివాసరావు, ఎ.ఉమామహేశ్వరరావు, వై.విశ్వనాథం, బి.వి.రమణ మూర్తి, పద్మావతి, ఎస్.కామేశ్వరరావు, మామిడి రమేష్, ప్రజారోగ్య ఎఇ బి.సుజన, విద్యుత్‌శాఖ ఎఇ జి.రామారావు, ఎంఎ.ఎ.మోహనరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు

ఆమదాలవలస: రైతులు తమ దిగుబడులను పెంచుకునేందుకు నాణ్యమైన విత్తనం అవసరమని, వివిధ సమయాల్లో చేపట్టాల్సిన కీలక చర్యలపై శిక్షణ పొందడంతో ఉత్పత్తిలో ఎదురయ్యే నష్టాలను అధిగమించవచ్చని కెవికె ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె. భాగ్యలక్ష్మి అన్నారు. జాతీయ ఆహార భద్రత పథకం - సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శనా క్షేత్రంలో కృషి విజ్ఞాన కేంద్రంలో అపరాల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులపైన సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకం ద్వారా అందిస్తున్న నాణ్యమైన విత్తనాలను రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ సీపాన నీలవేణి అపరాల విత్తన ఉత్పత్తిలోని మెలకువలను వివరించారు. సస్యపోషణ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్ మాట్లాడుతూ అపరాల్లో మెరుగైన దిగుబడులకు అవసరమైన ఎరువులు, కలుపు యాజమాన్య చర్యలు గురించి వివరించారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.అనూష శుద్ధి ప్రాముఖ్యత, సమగ్ర సస్యరక్షణ చర్యలను తెలిపారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ సిహెచ్. బాలకృష్ణ, బి.సునీత, వి. హరికుమార్ పాల్గొన్నారు.

3 నుంచి వ్యవసాయ సాంకేతికతపై సదస్సు

ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్తంగా ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై సదస్సు, ప్రదర్శనను డిసెంబరు 3,4,5 తేదీల్లో నిర్వహించనున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. 3న అగ్రిటెక్-2022 ప్రదర్శన సదస్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అనంతరం రైతులు, పరిశ్రమల ప్రతినిధులు, శాస్త్రవేత్తలతో చర్చాగోష్టి నిర్వహిస్తామన్నారు. 4న పంటల ఉత్పత్తి, సస్యరక్షణలో ఆధునిక విధానాలు, పర్యావరణహిత వ్యవసాయానికి సహజ వనరుల పరిరక్షణ, యాజమాన్యంపై అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. 5న వ్యవసాయ యాంత్రీకరణ, ఆహార ఇంజినీరింగ్ విభాగంలో వినూత్న సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్‌ను అనుసరించి చేసే విస్తరణ సేవలు గురించి వివరించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ, వివిధ సంస్థల నుంచి నూతన వంగడాలు, నూతన సాగు పద్ధతులు, ఉత్పత్తిదారుల సంఘాల ఉత్పత్తులను, యంత్రాలు ప్రదర్శించనున్నారని చెప్పారు. జిల్లాలోని ఆసక్తి ఉన్న రైతులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఉపకార వేతనాలకు 13 మంది ఎంపిక

ప్రజాశక్తి- జి.సిగడాం

స్థానిక మండల కేంద్రంలోని ఎపి మోడల్ పాఠశాలలో చదువుతున్న 13 మంది విద్యార్థులు పిఎంఎస్ఎస్‌సి ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ లంక అన్న శామ్యూల్ సోమవారం తెలిపారు. రాష్ట్రస్థాయిలో 7వ ర్యాంకును ఎ.ఎస్.జైకాంత్ సాధించగా, ప్రదీప్, గ్రీష్మ, ఆనంద్, జాహ్నవి, విద్యా దీక్షిత్, కీర్తన జాహ్నవి, యామిని, లోకేష్, బోలా శంకర్, గాయత్రి, మౌనికలు సాధించారని పేర్కొన్నారు. వీరికి ఏడాదికి రూ.75 వేలు ఉపకార వేతనాలు అందజేస్తుందన్నారు. ఈ ఎంపికపై ప్రిన్సిపాల్‌తో పాటు

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అన్నశామ్యూల్

ఉపాధ్యాయులు తిరుపతిరావు, వైకుంఠరావు, నేతాజీ, నాగమణి, ధనలక్ష్మి, ఉషారాణి, జోత్స్న, ప్రమీల, జగదీష్, రవికుమార్, సుబ్రహ్మణ్యం, గణేష్, గోవింద, అరుణ, మజ్జి ఈశ్వరరావు, ఐమేశ్వరరావులు అభినందించారు.

'మంత్రి అడ్డాలో ప్రగతి పడకేసింది'

పలాస: మంత్రి సీదిరి అప్పలరాజు అడ్డాలో ప్రగతి పడకేసిందని, మూడున్నర ఏళ్లలో ప్రధాన సమస్యలలో ఒక్కటైనా నెరవేర్చారా? అని జనసేన నాయకులు దుర్గారావు ప్రశ్నించారు. సోమవారం ఆయనొక ప్రకటనను విడుదల చేశారు. ప్రధాన సమస్యలైన ఆఫ్‌షోర్, మత్స్యకారుల కోసం నువ్వలరేవు, మంచినీళ్లపేట గ్రామాల మధ్య జెట్టీ ఏర్పాటు ఏమైందని ప్రశ్నించారు. ఉద్దానం ప్రజలకోసం పలాసలో 200 పడకల కిడ్నీ ఆస్పత్రి, సులధార పథకం వంటి పనులు ఎప్పుడు చేస్తారని అన్నారు. వాగ్దానాలు చేయడం తప్ప, అమలు లేదని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

వ్యవసాయ పరివర్తనలపై అవగాహన

ఆమదాలవలస : భూగర్భ జలాలను పూర్తిస్థాయిలో రైతులు సద్వినియోగం చేసుకోవాలని భూగర్భ జలశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.వి.రమణమూర్తి అన్నారు. మండలంలోని దివంజిపేటలో చింతపుట్టి చెరువు ఆయకట్టు రైతులకు భూగర్భ జలశాఖ, యూత్ క్లబ్ ఆఫ్ బెజ్జపురం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన సమీకృత సాగునీరు - వ్యవసాయ పరివర్తన పథకంపై సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి నిల్వలను పెంచడం ద్వారా రెండో పంటా పూర్తిస్థాయిలో నీటిని వినియోగించుకోవచ్చు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఒ మెట్ట మోహనరావు, సర్పంచ్ సైలాడ దాసునాయుడు, సాంకేతిక సహాయకులు ఎస్.రాజులునాయుడు, ఎపిడి ఎ.లక్ష్మణరావు, గురుమూర్తి, వనరులశాఖ ఎఒ ఎ..సూర్యఅన్వేష్, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ రేణుక పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

కొత్తూరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, దీనిపై బాలికల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ బి.చిన్నమ్మడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలతో, వెలుగు విఎలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులపైన, మహిళలపైన వేధింపులకు గురిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. చిన్నారుల సెల్‌ఫోన్ల వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. సమావేవంలో ఎపిఎం త్రినాథమ్మ, చైల్డ్ వెల్ఫేర్ అధికారి శివారెడ్డి, సూపర్‌వైజర్ దివ్యవాణి పాల్గొన్నారు.

అప్పలనాయుడు ఆర్థికసాయం

లావేరు: మండలంలోని మురపాక పంచాయతీ సిహెచ్.అగ్రహారానికి చెందిన కలమటి ప్రసాద్ బాలుడు ఇరువై రోజుల క్రితం సముద్రం స్నానానికి వెళ్లి గల్లంతై ఇప్పటకీ ఆచూకీ లభించలేదు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల నియోజకవర్గ వైసిపి నాయకులు లుకలాపు అప్పలనాయుడు సోమవారం ప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేలు ఆర్థికసాయం సోమవారం అందజేశారు. వైసిపి నాయకులు లండ కిరణ్, ముళ్ల మహేష్, చిన్నయ్యపేట వైసిపి నాయకులు మీసాల జగన్, సూరిబాబు, ఠాగూర్, గురునాయుడు పాల్గొన్నారు.

అర్హులకే పథకాలు

నందిగాం: అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకతీతంగా ప్రభుత్వ పథకాలు అందజేయాలని నందిగాం ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి సూచించారు. సోమవారం మండలంలో నూతనంగా నియమితులైన పది మంది వాలంటీర్లకు నియామక పత్రాలను ఎంపిపి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న దృష్ట్యా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపిపి ప్రతినిధి ఆర్.కూర్మారావు, ఎంపిటిసి ప్రతినిధి అంబోడి విష్ణు, సర్పంచులు మడపాల సంజీవరావు, కణితి నారాయణమూర్తి, మల్ల సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

సోంపేట: విద్యార్థులంతా తప్పనిసరిగా చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి రాము అన్నారు. స్థానిక మహర్షి విద్యానికేతన్‌లో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. రాజ్యాంగం మనకు ప్రసాధించిన హక్కులను అనుభవిస్తున్నప్పుడు, బాధ్యతలను కూడా సక్రమంగా నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజేశ్వరరావు, ఖాళీ ప్రసాద్, కరస్పాండెంట్ శకుంతల, ప్రిన్సిపాల్ తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవరుచుకోవాలి

నరసన్నపేట: నేటి ఆధునిక కాలంలో పుస్తక పఠనాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని, తద్వారా విజ్ఞానాన్ని పొందాలని శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ చీపురు రాణి కృష్ణమూర్తి అన్నారు. సోమవారం ఉదయం ఆమె విశాలాంధ్ర బుక్ హౌస్ సంచార గ్రంథాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బుక్ హౌస్ మేనేజర్ మహమ్మద్ నజీర్ ఖాన్, ఎన్.ఈశ్వరరావు, ఎఐవైఎఫ్ కన్వీనర్ కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

నందిగాం: మండల కేంద్రంలోని జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంటల తయారీని ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వంటలను పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా వంటలు తయారు చేయడంతో పాటు భోజనం పెట్టేటప్పుడు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, సర్పంచ్ ప్రతినిధి జడ్యాడ జయరాం, ఎంపిటిసి ప్రతినిధి అంబోడి విష్ణు, ఎస్ఎంసి చైర్మన్ సనపల చిన్నారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

శిష్టకరణ సంఘం మండల అధ్యక్షునిగా సదాశివుని కృష్ణ

నరసన్నపేట : నరసన్నపేట శిష్టకరణ సంఘం అధ్యక్షునిగా సదాశివుని కృష్ణ మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ సంఘ భవనంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో భాగంగా ఎన్నిక నిర్వహించారు. 68 మంది సభ్యుల్లో 66 మంది ఏకగ్రీవంగా కృష్ణను అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. పుష్కర కాలంగా అధ్యక్షునిగా కొనసాగుతున్నానని, తాను ఈ పదవికి రాజీనామా చేస్తున్నానని కృష్ణ ప్రకటించగా 95శాతం మంది అంగీకరించలేదు. దీంతో మరలా ఆయనే అధ్యక్షునిగా ఎన్నుకున్నట్లు ఎంవిజె. మోహనరావు, ఉర్లాం పార్వతీశ్వరరావు, యు.రాధాకృష్ణన్, డివి.రఘు, ప్రభాకరరావు, తదితరులు ప్రకటించారు. శిష్టకరణ సంఘం ఉపాధ్యక్షులుగా ఎంవిజె.మోహనరావు, ప్రధాన కార్యదర్శిగా వసంతకుమార్‌ను సీనియర్ వార్డు మెంబరు రఘుపాత్రుని శ్రీధర్ దుశ్శాలువతో సత్కరించారు.

'రాష్ట్రానికి ఇదేం ఖర్మ'

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంపై కార్యకర్తలు నాయకులకు టిడిపి జిల్లా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు కూన రవికుమార్ దిశానిర్దేశం చేశారు. పట్టణంలోని ఊసవానిపేట రైల్వే గేటు వద్ద గల శారద కళ్యాణ మండపంలో నాయకులు కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబరు ఒకటవ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ఏదో ఒక ప్రాంతంలో ఈ కార్యక్రమాన్ని మొదలు పెడతారని తెలిపారు. నియోజకవర్గంలో ప్రారంభించి గ్రామాల్లోకి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు మహిళా అధ్యక్షులు మెట్ట సుజాత, మున్సిపల్ మాజీ చైర్మన్ తమ్మినేని గీత, మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, చంద్రశేఖర్, నూకరాజు, సనపల ఢిల్లేశ్వరరావు, అన్నెపు భాస్కరరావు, ఎ.రామకృష్ణ, అంబళ్ల రాంబాబు, పల్లి సురేష్ పాల్గొన్నారు.

పోలాకి : ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో భాగంగా ఎస్-ఎల్‌విడి కళ్యాణ మండపంలో పార్టీ నాయకులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ వైఫల్యాలను, పలు అంశాలను పార్టీ నాయకులతో చర్చించారు. అనంతరం జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో మీనా కుమారి, కె.అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న న్యాయవాదులు

పూలే ఆశయాలు ఆదర్శప్రాయం

కవిటి: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలు ఆదర్శనీయమని వైసిపి ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. సోమవారం జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ఆవరణలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పూడి నేతాజీ, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, రెడ్డిక జెఎసి సెక్రెటరీ భర్ల నాగభూషణం, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, ఎంపిటిసి మానెక శంకర్ ప్రధాన్, నాయకులు దుద్ది ధర్మరావు, బెందాళం రమణ, యెన్ని అశోక్, ఎలమంచి నీలయ్య, ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి, ఎంఇఒ ధనుంజయ మజ్జి, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాజేశ్వరరావు, హెచ్‌ఎం బి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలాకి: జ్యోతిరావు పూలే ఆదర్శప్రాయుడని జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య అన్నారు. వైసిపి పార్టీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో నరసన్నపేట ఎంపిపి ఆరంగి మురళి , జెడ్‌పిటిసి చింతు రామారావు, సుడా చైర్మన్ ప్రతినిధి కె.సిహెచ్చ.బి.గుప్త , స్థానిక సర్పంచ్ బి.శంకర్, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం : మండలంలో జె.ఆర్.పురం పంచాయతీ రామతీర్థం కూడలి వద్ద ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఎంపిపి, జెడ్‌పిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం : నగరంలోని స్వాతంత్ర్య సమరయోధుల పార్కులోని జ్యోతిరావు పూలే విగ్రహానికి ఎపిబిసి అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మీనారాయణలు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎన్ని సూర్యారావు, సంయుక్త కార్యదర్శి కూన అన్నంనాయుడు, ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి- నందిగాం

విద్యార్థి దశలో క్రీడలో మానసిక ఆనందాన్ని ఇవ్వడంతో పాటు శారీరకదారుఢ్యాన్ని మెరుగుపరుస్తాయని నందిగాం ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అన్నారు. సోమవారం స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మూడు రోజుల పాటు సాగే మండల స్థాయి గ్రిగ్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో పాల్గొని తమలో దాగి ఉన్న ప్రతిభను కనపరచాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని చదువులో రాణించాలని కోరారు. హెచ్‌ఎం వై.హరిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నందిగాం సర్పంచ్ ప్రతినిధి జడ్యాడ జయరాం, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, ఎంపిటిసి ప్రతినిధి అంబోడి విష్ణు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, ఎపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు అనిల్‌కుమార్, ఎస్.చిన్నారావు, పి.ఈశ్వరరావు, కల్లాడ సర్పంచ్ ఎం.తిరుపతి రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: మండలంలోని వడ్డివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో విద్యార్థులకు ఆటల పోటీలను జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, ఎంపిపి ప్రతినిధి మేరుగు అప్పారావు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గూట్ల మలేశ్వరరావు, వైసిపి నాయకులు పల్లి రామారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్త్రీ, పురుషులు సమానమే

మెళియాపుట్టి: స్థానిక కెజిబివిలో విద్యార్థులకు లింగ వివక్షపై ఐకెపి ఎపిఎం లలిత ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లలిత మాట్లాడుతూ స్త్రీలు, పురుషులు సమానమని, స్త్రీలకు ఉండే హక్కులను వివరించారు. కార్యక్రమంలో సిసి వీరన్ననాయుడు, చంద్రమౌళి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వేధింపులకు ముగింపు పలకాలి

కవిటి: రోజురోజుకూ మహిళలపై పెరిగిపోతున్న లైంగిక వేధింపులు, అఘాయిత్యాలకు ముగింపు పలకాలని తహశీల్దార్ ఆర్ అప్పలరాజు, ఎంపిడిఒ పైలా సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు - నివారణ అనే అంశంపై ఐసిడిఎస్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు అమలు చేయాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్

ప్రజాశక్తి- పలాస

కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, లేకుంటే డిసెంబరు 5న అన్ని మండల కేంద్రాల్లో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ఆందోళన చేస్తామని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ అన్నారు. సోమవారం బికెఎంయు సభ్యుల సమావేశం పలాసలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ హయాంలో ఎనిమిది పర్యాయాలు భూ పంపిణీ జరిగిందని, ఆ తరువాత వచ్చిన సిఎంలు, ఇప్పుడున్న జగన్ ఒక్క సెంటు కూడా పేదలకు ఇవ్వలేదని అన్నారు. రాష్ట్రంలో సాగు భూములు కనుమరుగవుతున్నాయని, ప్రభుత్వం పరిశ్రమల పేరుతో సాగు భూములను స్వాధీనం చేసుకోవడం దారుణమన్నారు. నవరత్నాలు పథకాల్లో పదో రత్నంగా కోనేరు రంగారావు కమిటీ భూ పంపిణీ సిఫార్సులను చేర్చాలని డిమాండ్ చేశారు. జగనన్న కాలనీల్లో పేదలు ఇల్లు కట్టుకునేందుకు ప్రతికూల పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కిడ్నీ రోగులకు ఇస్తున్న రూ.10వేల సాయం చాలడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు చాపర సుందర్‌లాల్, బలగ శ్రీరామ్, లండ వెంకటరావు, చాపర వేణుగోపాల్, అప్పలనాయుడు, నారాయణస్వామి, కేశవ,. ఎం.వెంకటరమణ, వసంతరావు, దుర్గారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆవుల శేఖర్

శిక్షణ ఇస్తున్న ఎంఇఒ రామరాజు

కృత్యాధార బోధనపై శిక్షణ

ప్రజాశక్తి- పొందూరు

కృత్యాధార బోధన ద్వారా పిల్లలను పాఠశాలకు ఆకర్షితులను చేయవచ్చునని ఎంఇఒ పి.వి.రామరాజు అన్నారు. స్థానిక దివ్యజ్ఞాన మందిరం వద్ద యూత్ క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన ఇండియా లిటరసీ ప్రాజెక్టు నిర్వహించిన స్కూల్ రెడీనెస్, బాలవికాస్ ప్రోగ్రామ్‌లో భాగంగా కృత్యాధార బోధనపై ఉపాధ్యాయులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. చీపురుపల్లికి చెందిన శోధన ట్రస్టు రిసోర్సుపర్సన్లు ఉపాధ్యాయులకు మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా పర్యవేక్షకులు గురగుబెల్లి శ్యామలరావు, సంస్థ కోశాధికారి, విశ్రాంతి ఉపాధ్యాయుడు జి.అప్పలనాయుడు, రిసోర్స్‌పర్సన్లు సత్యం, రాధిక, కామునాయుడు, ప్రాజెక్టు కమ్యూనిటీ ఆర్గనైజర్స్ నాయుడు, సత్యవతి, విద్యాసాతిలు దుర్గారావు, జ్యోతి పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

వేరుశనగ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

ప్రభుత్వం సబ్సిడీపై అందజేసిన వేరుశనగ విత్తనాలను పిఎసిఎస్ అధ్యక్షులు కెల్లి జగన్నాయకులు, ఎంపిపి ప్రతినిధి మేరు అప్పారావు రైతులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందజేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదేనని అన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ మార్పు నాగభూషణరావు, సర్పంచ్ కె.లక్ష్మి, ఎంపిటిసి ప్రతినిధులు శిమ్మ సోమేష్, దూబ వేణు, వైసిపి నాయకులు గంట ఈశ్వరరావు, పల్లి రామారావు, వ్యవసాయశాఖ అధికారి జి.శ్రీలక్ష్మి, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, సాయిరాజు, సాయి కిషోర్ పాల్గొన్నారు.

నిరాహార దీక్ష చేస్తున్న బాధితులు

అగ్రిగోల్డ్ బాధితుల దీక్ష ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వైసిపి అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు అవుతున్నా అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరగలేదని అగ్రిగోల్డ్ బాధితుల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సనపల నరసింహులు అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ధర్మాగ్రహ దీక్ష శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ముందుగా నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌కు శిబిరం వద్ద వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ మోసానికి బలైన లక్షలాది మంది ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం జిల్లా కార్యదర్శి గోవిందరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జయరాం, ఎడ్ల గోపి పాల్గొన్నారు.

సిసి రోడ్డును ప్రారంభిస్తున్న దేవదాస్‌రెడ్డి

సిసి రోడ్డు పనులు ప్రారంభం

కంచిలి: మండలంలోని కొత్త అంపురంలో సోమవారం ఎంపిపి పైల వాసుదేవరెడ్డి సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ నిధులు రూ.5 లక్షలతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు గ్రామాల్లో మౌలికవసతుల కల్పనకు ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్ది మోహిని, వైసిపి మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయం, పిఎసిఎస్ అధ్యక్షులు గుమ్మడి రాందాస్, కేశవపాత్రో, లింగం, మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న 'ఎంజిఆర్' సభ్యులు

ఇంటింటికీ 'ఎంజిఆర్'

హిరమండలం : మండలంలోని కొమనాపల్లి, పాతకొమనాపల్లి, రుగడ, మీదరుగడ, ఈతలగూడ, అలాగే పాతపట్నం మండలంలోని సోద, కొత్తూరు మండలంలో బంకి, పాతపొన్నుటూరు, కొత్తపొన్నుటూరు, పొన్నుటూరు కాలనీ, రాయిలా, కాకరగూడ సామాజిక వేత్త, టిడిపి నాయకులు మామిడి గోవిందరావు యువసేన సభ్యులు సోమవారం ఇంటింటికీ ఎంజిఆర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 12 ఏళ్లుగా నియోజకవర్గంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను, సిద్ధాంతాలను కరపత్రాల రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తామర మాజీ సర్పంచ్ సిరిపురం బాబూరావు, యలకల వాసుదేవరావు, కలమట రమేష్‌బాబు, వాలిపల్లి వెంకటరమణ, బిల్లింగి భాస్కరరావు, కలిసేట్టి వేణుగోపాలరావు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యాన వైద్య శిబిరాలు

ఇచ్ఛాపురం: జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా మండలంలోని ఈదుపురం, సన్యాసిపుట్టుక గ్రామాల్లో సోమవారం జనసేన ఆధ్వర్యాన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈదుపురంలో జనసేన ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు సమక్షంలో మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన వైద్య శిబిరాన్ని జనసేన రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ కార్యదర్శి నాగుల హరి బెహరా ప్రారంభించారు. సన్యాసిపుట్టుగలో తిప్పన దుర్యోధనరెడ్డి సమక్షంలో రాగోలు జెమ్స్ ఆధ్వర్యాన వైద్యశిబిరం నిర్వహించారు. మొత్తం 700 మందికి పరీక్షలు నిర్వహించి ముందులు పంపిణీ చేశారు. బాసి భారతిరెడ్డి, జనసేన యూత్ సభ్యులు చింటూ బెహరా, రాహుల్ బెహరా, నారాయణ బెహరా, పవన్‌కుమార్, క్రాంతి పాల్గొన్నారు.